# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# జాతీయ వార్తలు

తేదీ: 22-08-2025 సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

## ముఖ్యాంశాలు

- ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఈరోజు బీహార్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో పలు అభివృద్ధి ప్రాజెక్టులను ప్రారంభించారు.
- భారతదేశం 5వ తరం యుద్ధ విమానాలను నిర్మించే దిశలో పయనిస్తోందని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు.
- పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో ఐదు కీలక బిల్లులకు ఆమోదం లభించిందని కేంద్ర మంత్రి సర్బానంద సోనోవాల్ వెల్లడించారు.
- జాతీయ అభివృద్ధి లక్ష్యాలకు అనుగుణంగా రహదారుల అభివృద్ధి ప్రాజెక్టులను చేపడతామని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ తెలిపారు.

=============================

ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఈరోజు పశ్చిమ బెంగాల్‌లో 5 వేల 200 కోట్ల రూపాయల విలువైన ప్రాజెక్టులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. జెస్సోర్ రోడ్ మెట్రో స్టేషన్‌ను సందర్శించి, నోపారా - జై హింద్ బిమన్‌బందర్ మెట్రో సర్వీస్‌ను ప్రారంభించారు. అనంతరం వీడియో కాన్ఫరెన్సింగ్ ద్వారా ఆయన సీల్దా-ఎస్ప్లనేడ్ మెట్రో సర్వీస్‌ను, బెలెఘాటా-హేమంత ముఖోపాధ్యాయ మెట్రో సర్వీస్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి మాట్లాడుతూ.. పౌరులకు ఉపాధి అవకాశాలు కల్పించడం, వారికి సహాయం చేయడం తమ ఉద్దేశ్యమని అన్నారు. ప్రజలను హింసిస్తున్న చొరబాటుదారులను దేశంలో నివసించడానికి అనుమతించేది లేదని స్పష్టం చేశారు. భారతదేశం ప్రపంచంలోనే 3వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా పురోగమిస్తున్న తరుణంలో కోల్‌కతా వంటి నగరాల పాత్ర చాలా కీలకమైనదని ప్రధానమంత్రి పేర్కొంటూ...

(వాయిస్ బైట్...32 సెకన్లు)

అంతకు ముందు ప్రధానమంత్రి బీహార్ రాష్ట్రంలో సుమారు 13 వేల కోట్ల రూపాయల విలువైన పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు.

=============================

వర్షాకాల సమావేశాల్లో పార్లమెంటు ఐదు కీలక బిల్లులను ఆమోదించిందని కేంద్ర ఓడరేవులు, షిప్పింగ్ మరియు జలమార్గాల శాఖా మంత్రి సర్బానంద సోనోవాల్ ఈరోజు తెలిపారు. ఇటీవల ముగిసిన సమావేశాల్లో బిల్స్ ఆఫ్ లాండింగ్ 2025, ది క్యారేజ్ ఆఫ్ గూడ్స్ బై సీ బిల్ 2025, ది కోస్టల్ షిప్పింగ్ బిల్ 2025, మర్చంట్ షిప్పింగ్ బిల్ 2025, ఇండియన్ పోర్ట్స్ బిల్ 2025 లకు ఆమోదం లభించిందని పేర్కొన్నారు. ఈ నూతన బిల్లులు వలసరాజ్యాల కాలం నాటి సముద్ర చట్టాలను సవరించి, నీలి ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేస్తాయని వివరించారు. బిల్స్ ఆఫ్ లాండింగ్ 2025, వివాదాలను తగ్గించడం, వ్యాపార సౌలభ్యాన్ని మెరుగుపరచడం, చట్టపరమైన విధానాలను సరళీకృతం చేయడంపై దృష్టి పెడుతుందన్నారు. అలాగే.. కోస్టల్ షిప్పింగ్ బిల్ 2025, భారతదేశ 6 శాతం మోడల్ వాటాను పునరుద్ధరించడం, లాజిస్టిక్స్ ఖర్చులలో ఏటా దాదాపు 10 వేల కోట్ల రూపాయలు ఆదా చేయడంతో పాటు కాలుష్యం, రహదారి రద్దీని తగ్గించడం లక్ష్యంగా రూపొందించబడిందని కేంద్ర మంత్రి వివరించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

గడచిన 4 సంవత్సరాల్లో జమ్మూ, కాశ్మీర్ అంతటా హైవేల నిర్మాణం, అభివృద్ధి ప్రాజెక్టులలో గణనీయమైన పురోగతి సాధించిందని కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖ వెల్లడించింది. 2021-22 అలాగే 2024-25 మధ్యకాలంలో మొత్తం 43 హైవేల అభివృద్ధి ప్రాజెక్టులు ఆమోదించబడ్డాయని కేంద్ర రోడ్డు రవాణా మరియు రహదారుల శాఖా మంత్రి నితిన్ గడ్కరీ తెలియజేశారు. ఈ ప్రాజెక్టుల కింద 27 వేల 800 కోట్ల రూపాయల వ్యయంతో 653 కిలోమీటర్ల రోడ్ల నిర్మాణం జరిగిందని పేర్కొన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2024-25లో, ఈ నెల వరకు మరో 5 ప్రాజెక్టులకు అనుమతి లభించిందన్నారు. జాతీయ రహదారుల అభివృద్ధి నిరంతర ప్రక్రియ అని, ట్రాఫిక్ సాంద్రత, రహదారి పరిస్థితి, కనెక్టివిటీ అవసరాలు, జాతీయ అభివృద్ధి లక్ష్యాలకు అనుగుణంగా ప్రాధాన్యతల ఆధారంగా ప్రాజెక్టులను చేపడతామని కేంద్ర మంత్రి వివరించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

జమ్మూలోని పలు ప్రాంతాల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ED) ఈరోజు సోదాలు నిర్వహించింది. కోట్లాది రూపాయల భూ కుంభకోణంతో ప్రమేయం ఉన్న పలువురు రెవెన్యూ అధికారులు, సిబ్బంది లక్ష్యంగా సోదాలు కొనసాగాయి. స్థానిక పోలీసులు, CRPF సహాయంతో కేంద్ర ఏజెన్సీ బృందాలు ఈ కేసుతో సంబంధం ఉన్న అధికారుల నివాసాలు, కార్యాలయాలపై దాడులు చేసి, పలు పత్రాలు, డిజిటల్ రికార్డులను స్వాధీనం చేసుకున్నాయి. ఈ భూ కుంభకోణంలో 'మనీలాండరింగ్' కోణాలకు సంబంధించి దర్యాప్తు సంస్థలు సమాచారాన్ని పంచుకున్న తర్వాత ED ఈ దాడులను చేపట్టింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

భారతదేశం పటిష్టమైన రక్షణ పర్యావరణ వ్యవస్థను నిర్మిస్తోందని రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. ఈరోజు న్యూఢిల్లీలో జరిగిన ఒక కార్యక్రమంలో రక్షణ మంత్రి మాట్లాడుతూ.. దేశం 5వ తరం యుద్ధ విమానాలను నిర్మించే దిశలో పయనిస్తోందన్నారు. 66 వేల కోట్ల రూపాయల వ్యయంతో 97 తేజస్ యుద్ధ విమానాలను తయారు చేయడానికి ప్రభుత్వం HAL సంస్థతో ఒప్పందం చేసుకుందని చెప్పారు. దేశంలోని శక్తివంతమైన రక్షణ తయారీ పర్యావరణ వ్యవస్థలో పెట్టుబడులు పెట్టాలని అన్ని విదేశీ సంస్థలను, పెట్టుబడిదారులను ఆహ్వానించారు. రక్షణ రంగంలో ఆవిష్కరణ, సాంకేతిక అభివృద్ధిని ప్రోత్సహించడానికి ఇన్నోవేషన్ ఫర్ డిఫెన్స్ ఎక్సలెన్స్ (IDEX) ను ప్రారంభించామని రక్షణ మంత్రి పేర్కొంటూ...

(వాయిస్ బైట్...36 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఉప రాష్ట్రపతి ఎన్నికల కోసం భారత ఎన్నికల సంఘం ఇద్దరు పరిశీలకులను నియమించింది. పంచాయతీరాజ్ మంత్రిత్వ శాఖ అదనపు కార్యదర్శి సుశీల్ కుమార్ లోహాని, ఆర్థిక మంత్రిత్వ శాఖ అదనపు కార్యదర్శి డి. ఆనందన్ లను పరిశీలకులుగా నియమిస్తూ ఈ మేరకు ఉత్తరువులు జారీ చేసింది. వచ్చే నెల 9వ తేదీన జరగనున్న ఉపరాష్ట్రపతి ఎన్నికలకు ఎన్డీఏ కూటమి తమ అభ్యర్థిగా సిపి రాధాకృష్ణన్‌ను ఎంపిక చేయగా, ప్రతిపక్ష ఇండియా కూటమి.. సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి బి. సుదర్శన్ రెడ్డిని బరిలో నిలిపింది. ఇదిలా ఉండగా ఎన్డీఏ కూటమి పార్లమెంట్ సభ్యులు ఈరోజు న్యూఢిల్లీలో ఉపరాష్ట్రపతి అభ్యర్థి సి.పి. రాధాకృష్ణన్‌ను ఘనంగా సత్కరించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఐక్యరాజ్యసమితి శాంతి పరిరక్షక కార్యకలాపాలలో మహిళల భాగస్వామ్యానికి భారత్ మద్దతునిస్తుందని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. ఈరోజు న్యూఢిల్లీలో ఐక్యరాజ్యసమితి మహిళా సైనిక అధికారులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. దేశ సాయుధ దళాలు, శాంతి పరిరక్షక దళాలలో మహిళల భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడానికి, వారు సేవలు అందించడంతో పాటు నాయకత్వం వహించేందుకు సమాన అవకాశాలు ఉండేలా ప్రభుత్వం తన విధానాన్ని బలోపేతం చేస్తోందని పేర్కొన్నారు. లింగ సమానత్వం, ప్రపంచ శాంతిని పెంపొందించడానికి భారతదేశం ఐక్యరాజ్యసమితితో పాటు దళాలను అందించే ఇతర దేశాలతో కలిసి పనిచేస్తుందని స్పష్టం చేశారు.

==============================

రానున్న రెండురోజుల్లో ఢిల్లీ, హర్యానా, చండీగఢ్, జమ్మూ కాశ్మీర్, మహారాష్ట్ర, పంజాబ్, సిక్కింల లోని కొన్ని ప్రాంతాలలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (IMD) తెలిపింది. అలాగే బీహార్, జమ్మూ కాశ్మీర్, లడఖ్, ముజఫరాబాద్, జార్ఖండ్, ఒడిశా, తెలంగాణ, పశ్చిమ బెంగాల్, సిక్కింలతో పాటు దేశ ఈశాన్య ప్రాంతంలోని కొన్ని ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురుస్తాయని పేర్కొంది.

==============================

కేరళలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ 25 శాతం సీట్లు సాధిస్తుందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా అన్నారు. మలయాళ మనోరమ వార్తాపత్రిక ఈరోజు కొచ్చిలో నిర్వహించిన అభివృద్ధి సదస్సును కేంద్ర మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వచ్చే ఏడాది జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి మెరుగైన పనితీరు కనబరుస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. నూరు శాతం అక్షరాస్యత, పర్యాటకం మొదలైనవి కేరళ అభివృద్ధికి దోహదపడుతున్నాయన్నారు. కేరళ రాష్ట్రానికి అనేక అవకాశాలు ఉన్నాయని, ప్రజల కోసం వాటిని అన్వేషించాలని అన్నారు. కేరళలో విపత్తు నిర్వహణ కోసం ప్రధానమంత్రి నరేంద్రమోదీ సారధ్యంలోని కేంద్ర ప్రభుత్వం 5 వేల 100 కోట్ల రూపాయలు ఇచ్చిందని కేంద్ర హోంమంత్రి తెలియజేశారు.

==============================
==============================